

హోమియో...

డైలీ హెల్త్ డైరీ

# బాబు ఏడ్చినప్పుడు ఫిట్స్ వస్తుంటే..?



డాక్టర్ రాజశేఖర్, ష్యూర్‌కేర్ హోమియోపతి

మా అబ్బాయికి ఐదేళ్లు. వాడికి చిన్నప్పట్నుంచి జ్వరం వచ్చి ఫిట్స్ వస్తున్నాయి. గత రెండేళ్లుగా వాడికి కోపం వచ్చినప్పుడు, బాగా ఏడ్చినప్పుడు, ఎవరైనా కొట్టడానికి వచ్చినప్పుడు, భయపడ్డప్పుడు ఊపిరిబిగబట్టి, ఏడుస్తూ మెల్లగా బిగుసుకుపోతాడు. తర్వాత ఫిట్స్ వస్తాయి. కాని, ఏడుస్తూ పేచీ పెడుతున్నప్పుడు ఎవరైనా ఎత్తుకుని తిప్పినట్లయితే ఏడుపు ఆపుతాడు. ఫిట్స్ రావు. మా అబ్బాయికి ఫిట్స్ ఎందుకు వస్తుండవచ్చు. దీనికి హోమియోలో మందులున్నాయా?

– భాగ్యలక్ష్మి, కరీంనగర్

మెదడు నుంచి విడుదలయ్యే అవాంఛిత ఎలక్ట్రిక్ ఇంపల్స్‌ను ఫిట్స్ లేదా సీజర్స్ అంటారు. సాధారణంగా మెదడుకు రక్తం సరిగ్గా అందకపోవడం, ఆక్సిజన్ అందకపోవడం వల్ల ఈ సమస్య వస్తుంటుంది.

**ఫిట్స్‌కు మరికొన్ని కారణాలు :**

- హైపోగ్లైసీమియా అంటే రక్తంలో చక్కెర పాళ్లు తగ్గడం
- ఇన్ఫెక్షన్లు
- తలకు గాయం కావడం
- విషాహారం
- డ్రగ్స్ రియాక్షన్ వల్ల
- మెదడులో ట్యూమర్స్ ఉండటం.

చిన్నపిల్లల్లో జ్వరం వచ్చినప్పుడు అంటే శరీర ఉష్ణోగ్రత 100.4 ఫారన్‌హీట్ కంటే ఎక్కువగా ఉన్నప్పుడు ఫిట్స్ వస్తుంటాయి. ఇలా ఫిట్స్ వచ్చినప్పుడు చల్లటినీటితో స్నానం చేయించడం, తడిగుడ్డతో ఒళ్లు తుడవటం జరిగితే అవి తగ్గిపోతాయి. కొన్నిసార్లు ఐదేళ్ల లోపు పిల్లలు ఉద్వేగపరంగా దెబ్బతినడం వల్ల (అంటే తల్లిదండ్రులు పట్టించుకోకుండా ఉండటం వంటివి జరిగినప్పుడు) శ్వాసబిగబట్టి, శరీరం పాలిపోయినట్లుగా అయి, నీలం రంగులోకి మారి, కండరాలు బిగదీసుకుపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాంటప్పుడు స్పృహ కోల్పోవడం జరుగుతుంది. ఇది ప్రాణాంతకం కాకపోయినప్పటికీ త్వరగా వైద్యుణ్ణి సంప్రదించడం తప్పనిసరి.

చిన్నపిల్లలో ఫిట్స్ ఎందుకు వస్తున్నాయో ముందుగా వైద్యుల సహాయంతో తెలుసుకుని దానికి తగిన చికిత్స అందించాల్సి ఉంటుంది.

చిన్నపిల్లల్లో వచ్చే ఇలాంటి ఫిట్స్‌ను పూర్తిగా నివారించడానికి హోమియోలో మంచి మందులు అందుబాటులో ఉన్నాయి.

లక్షణాలను బట్టి ఈ కింది మందులను ఉపయోగించవచ్చు.

ఏతూ్యజా : పాలు సరిపడనప్పుడు పిల్లలు పాలు తాగిన ప్రతిసారీ ఒక్కసారిగా పెరుగులాగా ముద్దలు ముద్దలుగా వాంతి చేసుకుంటుంటారు.



ఫిట్స్ బారిన పడినప్పుడు బొటనవేలిను మడిచి, కళ్లు కిందికి చూస్తున్నట్లుగా ఉంటాయి. కంటిపాపలు ఒకే దగ్గర ఫిక్స్ అయిపోయినట్లు ఆగిపోతాయి. నోరు బిగుసుకుపోయి తెల్లటి నురగ వస్తుంది. నాడి మెల్లగా కొట్టుకుంటుంది. ఈ లక్షణాలకు ఈ మందు బాగా పనిచేస్తుంది.

బెల్లడోనా : ఫిట్స్ సోకి తల వేడిగా ఉండటం, కళ్లు, ముఖం ఎర్రగా అయిపోవడం, తలలోని నరాలలో రక్తం నిండటం వల్ల అవి వాచినట్లుగా కనపడటం, తలను తలగడలోకి దూరుస్తూ ఉండటం, కనుపాపలు వెడల్పు కావడం వంటి లక్షణాలు కనిపించినప్పుడు ఈ మందును వాడవచ్చు.

చామోమిల్లా : తల్లి కోపంగా ఉన్నప్పుడు తల్లిపాలను తాగిన పిల్లల్లో ఫిట్స్ వస్తుంటాయి. సాధారణంగా పాలదంతాలు వస్తున్న సమయంలో పిల్లలు వ్యాధుల బారిన పడుతుంటారు. ఎప్పుడూ ఏడుస్తూ పేచీ పెట్టే పిల్లలు ఎత్తుకున్నప్పుడు మాత్రం బాగుంటారు. చిన్న విషయానికి కోపం వచ్చి ముఖం ఒకవైపునకు పాలిపోవడం, మరోవైపు ఎర్రబడటం జరుగుతుంటే ఫిట్స్ తగ్గించడానికి ఈ మందు వాడవచ్చు.

సినా : కడుపులో పురుగులు ఉండటం వల్ల కొంతమంది పిల్లలు ఎప్పుడూ పళ్లు కొరుకుతూ ఉంటారు. ఆకలి విపరీతంగా ఉన్నప్పటికీ తల్లిపాలను తాగడానికి ఇష్టపడరు. తీపి పదార్థాలను ఎక్కువగా కోరుకుంటారు. ఇలాంటి పిల్లలకు వచ్చే ఫిట్స్‌కు ఈ మందు వాడవచ్చు.

స్ట్రామోనియమ్ : ఒంటరిగా ఉండటం వల్ల, భయం వల్ల, నీటి నుంచి గాని, అద్దం నుంచి గాని వచ్చే కాంతి అకస్మాత్తుగా ముఖంపై పడటం వల్ల ఫిట్స్ వస్తున్నట్లయితే ఈ మందు వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. ఫిట్స్ వచ్చినా స్పృహ కోల్పోని పిల్లలకు కూడా ఈ మందు పనిచేస్తుంది.

మీరు చెప్పిన లక్షణాలను బట్టి మీ అబ్బాయికి చామోమిల్లా ఔషధాన్ని 1ఎం. పొటెన్సీలో ప్రతి పదిరోజులకు ఒక డోస్ చొప్పున వాడుతూ ప్రతిరోజూ శాక్రమ్ లాక్టిస్ పిల్స్ ఉదయం, సాయంత్రం రెండుసార్లు వాడండి. మీ అబ్బాయి విషయంలో పౌష్టికాహారలోపం వల్ల కూడా ఫిట్స్ వచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఆహారం విషయంలో శ్రద్ధ వహించండి.